ప్రజాశక్తి
బుధవారం 26 నవంబర్ 2025
కర్నూలు

మాట్లాడుతున్న ఐద్వా సీనియర్ నాయకురాలు పి.నిర్మల

రాజ్యాంగం అందరికీ అర్థమైందా..?

- న్యాయం అందని ద్రాక్షేనా..?
- నేడు రాజ్యాంగ, జాతీయ న్యాయ దినోత్సవం





ప్రజాశక్తి-కర్నూలు కల్చరల్

ప్రతి సంవత్సరం నవంబర్ 26న ఇండియా... రాజ్యాంగ దినోత్సవాన్ని జరుపుకుంటోంది. దీన్నే సంవిధాన్ దివస్ అని కూడా అంటారు. ఇదే రోజును జాతీయ చట్ట దినోత్సవం (నేషనల్ లాడే)గా కూడా జరుపుకుంటారు. 1949 నవంబర్ 26న భారతదేశం... రాజ్యాంగాన్ని దత్తత చేసుకుంది. అంటే భారత రాజ్యాంగ అసెంబ్లీ... రాజ్యాంగాన్ని స్వీకరించింది. ఆ తర్వాత 1950 జనవరి 26 నుంచి భారత్‌లో రాజ్యాంగం అమల్లోకి వచ్చింది.

2015 నవంబర్ 19న... కేంద్ర ప్రభుత్వం... నవంబర్ 26ను రాజ్యాంగ దినోత్సవంగా ప్రకటిస్తూ... గెజిట్ నోటిఫికేషన్ ఇచ్చింది. భారత రాజ్యాంగ ప్రతిని రూపొందించిన రాజ్యాంగ కమిటీకి అంబేద్కర్ అధ్యక్షుడిగా వ్యవహరించారు. రాజ్యాంగ రూపకల్పనలో ఆయన కీలక పాత్ర పోషించారు. ఇది వరకు నవంబర్ 26న లా డేగా జరుపుకునేవారు. నవంబర్ 26న... రాజ్యాంగం ప్రాధాన్యం, అంబేద్కర్ ఆశయాలపై ప్రజల్లో అవగాహన కల్పిస్తారు. ఆయన 1891 ఏప్రిల్ 14న జన్మించారు. . 1956 డిసెంబర్ 6న కన్ను మూశారు. అంబేద్కర్ జీవితంలోని ముఖ్య ఘట్టాలను నవంబర్ 26న విద్యర్థులు, ప్రజలకు తెలిసేలా స్కూళ్లు, కాలేజీలు, ప్రభుత్వాలు అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తాయి. కాలేజీలు, యూనివర్శిటీల్లో రాజ్యాంగంపై ప్రసంగాలు, డిబేట్లు నిర్వహిస్తారు. మాక్ పార్లమెంట్ వంటివి కూడా జరుపుతారు. ప్రజాస్వామ్యం, రాజ్యాంగ విలువలపై విద్యార్థుల్లో అవగాహనను పెంచుతారు. సమాజం పట్ల వారిలో సేవానిరతిని పెంపొందిస్తారు.

నేషనల్ లాడే గురించి : వంద మంది తప్పించుకున్నా పర్వాలేదు. ఒక్క నిర్ధోషికి శిక్ష పడకూడదని ఎప్పటినుంచో చెబుతున్న మాట, మనం నిరంతరం వింటున్నమాట. అయితే న్యాయ వ్యవస్థలో అనేక సంస్కరణలు తీసుకొచ్చి నప్పటికీ అసలు చేయాల్సిందే విస్మరిస్తున్నారు. సుప్రీంకోర్టు న్యాయ మూర్తిగా పనిచేసిన మార్కండేయ కట్జూ ఒక కేసు ఉదంతాన్ని చెబుతూ వందరూపాయల దొంగతనం కేసులో అరెస్టుచేసి 39 సంవత్సరాల తర్వాత అతన్ని నిర్దోషిగా విడుదల చేశారని చెప్పు కొచ్చారు. ఇది మన న్యాయవ్యవస్థ మంద గమనాన్ని తెలియ జేస్తుంది. 140 కోట్లు దాటిన జనాభాలో దాదాపు 5 కోట్ల కేసులు పెండింగ్‌లో ఉన్నట్లు నివేదికలు చెబుతున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో దాదాపు తొమ్మిది లక్షల కేసులు, కర్నూలు జిల్లాలో దాదాపు 5 వేలకు పైగా కేసులు పెండింగ్‌లో ఉన్నట్లు గణాంకాలు చూస్తే అర్థమౌతున్నది. సత్వర న్యాయం అందేందుకు ఏం చేయాలన్నది మిలియన్ డాలర్ల ప్రశ్న.

బ్యూరోక్రసీ పాత్ర కూడా ఉంది

న్యాయవ్యవస్థలో బ్యూరోక్రసి పాత్ర కూడా వుంది. కేసులు, న్యాయమూర్తుల నిష్పత్తి తీసుకుంటే వేలాది కేసులకు ఒక జడ్జి వున్న ఏకైక దేశం ప్రపంచంలో మనదే అవుతుంది. దీంతో న్యాయమూర్తులు దృష్టి కేంద్రీకరించ లేక పోతున్నారు. న్యాయవాదులు కూడా శక్తికి మించి కేసులు తీసుకోవడం వల్లకూడా వాయిదాలు పడుతున్నాయి. కేసుల్లో జాప్యం జరుగుతున్నది. కేసుల్లో ప్రొసీజర్ ప్రకారమే నడచుకోవాలి. ఆ సందర్భంలోనూ జాప్యం జరిగే అవకాశం వుంది. అక్కడ స్టేత్వరగా వెకేట్ కాకపోతే సహజంగా కేసుల కాలపరిమితి పెరుగుతుంది.

- యు.సుబ్బన్న న్యాయవాది, ఆదోని.

న్యాయమూర్తుల సంఖ్య తక్కువగా ఉంది

కేసులను పరిష్కారించాలంటే న్యాయ మూర్తుల నియామకాలు చేయాలి. లోక్ అదాలత్‌లు పెడుతున్నారు. ఉదాహరణకు డ్రంక్ అండ్ డ్రైవ్‌లలో కేసుల సంఖ్య ఎక్కువగా వుంటుంది. వాటిని పరిష్కరించి ఎక్కువ కేసులు పరిష్కరించినట్లు చెబుతున్నారు. మిగతా వాటి పరిస్థితి ఏమిటి అన్నది కూడా ప్రధానమే. కోర్టుల సంఖ్య కూడా పెంచాలి.

- ఎ.తిమ్మప్ప, న్యాయవాది, ఎమ్మిగనూరు.

మండలానికి ఒక కోర్టు ఉండాలి

అత్యున్నత న్యాయవ్యవస్థలో రాజకీయజోక్యం పెరుగుతున్నది. ఇది మంచి పరిణామం కాదు. స్వయం ప్రతిపత్తి కలిగిన వాటిలో వీరి జోక్యం అర్థం కావడం లేదు. కాలానుగుణంగా ప్రజల్లో చైతన్యం పెరిగింది. చట్టాలపై అవగాహన పెరుగుతుంది. మండలానికొక కోర్టు పెట్టాలి. తగిన సిబ్బందిని నియమించాలి.

- మహమ్మద్ మియా, జనవిజ్ఞానవేదిక సీనియర్ నాయకులు.

సంస్కరణలు వేగవంతమవ్వాలి

వేగవంతంగా న్యాయ వ్యవస్థలో సంస్కరణలు చేపట్టాలి. సామాన్యులకు సత్వర న్యాయం అందించగలిగినప్పుడే వ్యవస్థపై నమ్మకం కలుగుతుంది. గ్రామీణ ప్రాంతాల్లో కేసుల సంఖ్య పెరుగుతున్నది. ముందుగా నివారించే ప్రయత్నం జరగాలి. విలువలు అంతరించడం మూలంగా కేసులు తీవ్రతరమవుతున్నాయి.

- పి.హమీద్ బాషా, ఉపాధ్యాయులు.

రాజ్యాంగం అందరికీ ఎందుకు తెలియదు..?

రాజ్యాంగ పరిషత్‌లో బాబా సాహెబ్ అంబేద్కర్ మాటలని అర్థం చేసుకోవాలి. 'రాజ్యాంగం ఎంత ఉన్నతమైనది అయినా దాని అమలు చేసేవారు ఉన్నతులు కాకపోతే అది చెడ్డ రాజ్యాంగంగానే నిరూపితమవుతుంది' రాజ్యాంగ పరిషత్తులో 1948 నవంబర్ 4న, 1949 నవంబర్ 25న రెండు సందర్భాలలో రాజ్యాంగ నైతికత అంటే ఏమిటో అంబేద్కర్ ప్రస్తావిస్తారు. రాజ్యాంగం ద్వారా ఎన్నుకోబడిన పాలకులకు, రాజ్యాంగ వ్యవస్థలైన పార్లమెంటు, పరిపాలన విభాగం, న్యాయ వ్యవస్థకు, రాజ్యాంగ వ్యవస్థలను నడిపే బ్యూరోక్రాట్స్, న్యాయ వ్యవస్థను నడిపే న్యాయమూర్తులకు, న్యాయవాదులకు, రాజ్యాంగం ద్వారా పరిపాలించబడుతున్న ప్రజలకు కూడా రాజ్యాంగ నైతికత ఉండాలి. అంటే దేశ ప్రజలందరికీ ఉండాలి. అంటే మనకు ఇష్టం ఉన్నా లేకపోయినా రాజ్యాంగ విలువలను ఒప్పుకోవాలి. పాలకులు వ్యక్తిగత అజెండాతో రాజ్యాంగాన్ని ఒప్పుకోరో, అప్పటి వరకు దానిని అమలు కూడా చేయలేరు. వారి జీవితాలకు అన్వయించుకోరు. అందుకే బాబాసాహెబ్ అంబేద్కర్ 'ఇప్పుడు మనం విరుద్ధ మైన జీవితంలోకి ప్రవేశిస్తున్నాం' అంటారు. రాజ్యాంగం అనేది అడ్వకేట్స్ కోసం ఏర్పాటు చేసిన లీగల్ డాక్యుమెంట్ కాదు అది ప్రజాస్వామ్యానికి ఆత్మ లాంటిది. అంటారు. స్వేచ్ఛ, సమానత్వం , సోదర భావం కంటిన్యూగా సమాజంలో అమలు చేయబడితేనే సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయాలను పొందే స్వేచ్ఛను సమాజానికి అందించగలం. లేకపోతే ఈ మూడు పదాలు కేవలం పేపర్ పై రాసుకున్న స్లొగన్స్ లాగా మిగిలిపోతాయి. సామాజిక , ఆర్థిక అసమానత్వం సమాజాన్ని ఎప్పుడూ విభజిస్తూనే ఉంటాయి. పాలకులు పన్నిన మొదటి కుట్ర ఏమిటంటే రాజ్యాంగంలో ఏముంది అనే విషయాలను ప్రజలకు, విద్యావంతులకు, మేధావులకు కూడా ఎక్కువ కాలం తెలియనివ్వకుండా దూరంగా ఉంచారు. ఎప్పుడైతే వీరందరికీ రాజ్యాంగాన్ని దూరంగా ఉంచారో, అందులో ఉన్న అంశాలు అర్థం కావు. ఇప్పటికీ 90శాతం మందికి రాజ్యాంగం నైతికత, రాజ్యాంగ విలువలు, రాజ్యాంగం ప్రాముఖ్యత తెలియదు. వీటన్నింటికీ కారణం పాలకవర్గం మాత్రమే. రాజ్యాంగంలోని మూలసూత్రాలు ప్రజాస్వామ్యం, స్వామ్యవాదం, లౌకికతత్వం, సమైఖ్యవాదం అమలుకు నోచుకోవడం లేదు.

డా. హరి ప్రసాద్ కంచర్ల

- డాక్టర్ కంచర్ల హరిప్రసాద్, నేషనల్ ఇబిసి మోర్చా జాతీయ కమిటీ సభ్యుడు.

హింసకు వ్యతిరేకంగా పోరాడదాం

- ఐద్వా సీనియర్ నాయకురాలు పి.నిర్మల

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

మహిళలపై రోజురోజుకు జరుగుతున్న దాడులు, అత్యాచారాలు, హింసకు వ్యతిరేకంగా పోరాడుదామని ఐద్వా సీనియర్ నాయకురాలు పి.నిర్మల పిలుపునిచ్చారు. మంగళవారం హింస వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ఐద్వా జిల్లా కమిటీ ఆధ్వర్యంలో స్థానిక సుందరయ్య భవన్‌లో సెమినార్ నిర్వహించారు. ఐద్వా జిల్లా అధ్యక్షురాలు శ్యామల అధ్యక్షత వహించారు. సెమినార్ ను ఉద్దేశించి ఐద్వా సీనియర్ నాయకురాలు పి.నిర్మల, జిల్లా కార్యదర్శి కె.అరుణ మాట్లాడారు. దేశంలో రోజురోజుకి మహిళలపై వయసుతో సంబంధం లేకుండా దాడులు, అత్యాచారాలు పెరిగిపోతున్నా యని తెలిపారు. చీకటి పడితే చాలు చిన్నపిల్లల నుంచి ముసలి వారి దాకా మహిళలు బయట స్వతంత్రంగా తిరగలేని పరిస్థితి ఉందన్నారు. మహిళలు అణచివేతకు వ్యతిరేకంగా, సమాన హక్కుల కోసం పోరాడాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల రక్షణ కోసం తీసుకువచ్చిన చట్టాలను కఠినంగా అమలు చేయకపోవడం వలన రోజు రోజుకి మహిళలపై దాడులు, దౌర్జన్యాలు పెరిగిపోతున్నా యని విమర్శించారు. దేశంలో మహిళలను మతం పేరుతో విభజించి, మహిళలను ఆధ్యాత్మిక వైపు నడిచే విధంగా, మూఢనమ్మకాలను సమర్థిస్తూ, మనువాదాన్ని కేంద్రంలోని బిజెపి మహిళలకు వ్యతిరేకంగా నిర్ణయాలు తీసుకుంటుందని ఆరోపించారు. అర్ధరాత్రి మహిళలు స్వతంత్రంగా బయట తిరిగి నప్పుడు, ఆ విధమైన రక్షణ కల్పించినప్పుడే మహిళల అభివృద్ధి జరుగుతుందని, మహిళా అభివృద్ధి సమాజాభివద్ధి అన్నారు. మహిళలు తమ ఇళ్లలో చైతన్యవంతమైన బాధ్యతలు నిర్వహిస్తూనే, ఇంటికే పరిమితం కాకుండా బయట జరుగుతున్న అత్యాచారాలకు, హింసకు వ్యతిరేకంగా పోరాడాల్సిన అవసరం ఎంతైనా తెలిపారు. హింస వ్యతిరేక దినోత్సవం నుండి డిసెంబర్ 10వ తేదీ మానవ హక్కుల దినోత్సవం వరకు ఐద్వా ఆధ్వర్యంలో జరిగే సెమినార్స్‌ను జయప్రదం చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా కోశాధికారి సుజాత, న్యూ సిటీ కార్యదర్శి కుమారి, జిల్లా కమిటీ సభ్యులు సావిత్రి, వేణి, రాధమ్మ, ఉమా, పర్వీన్ తదితరులు పాల్గొన్నారు.

పాఠ్యాంశాలను సులభ రీతిలో బోధించాలి

- ఎస్ఎస్‌సిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి : డిఇఒ ఎస్.శ్యామ్యూల్ పాల్

ప్రజాశక్తి - క్రిష్ణగిరి



రికార్డులను పరిశీలిస్తున్న డిఇఒ శ్యామ్యూల్ పాల్

ఉపాధ్యాయులు బోధన నైపుణ్యాలను మెరుగు పరచుకోవాలని, సాంకేతిక పద్ధతులను ఉపయోగించి పాఠాలను విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే విధంగా బోధించాలని డిఇఒ ఎస్.శ్యామ్యూల్ పాల్ సూచించారు. మంగళవారం క్రిష్ణగిరిలోని మోడల్ స్కూల్, ఎమ్మార్సీ కేంద్రం, కేజీబీవీ పాఠశాల, ఎరుకల చెరువు ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను డిఇఒ ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డిఇఒ పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. సిలబస్ పూర్తి స్థితి, పాఠ్యాంశాల బోధన ప్రణాళిక, గణితం, ఫిజికల్ సైన్స్, ఇంగ్లీష్ తదితర సబ్జెక్టుల్లో విద్యార్థుల ప్రగతి వివరాలు తెలుసుకున్నారు. ఏ పాఠ్యాంశాలు క్లిష్టతరంగా ఉన్నాయో అడిగి తెలుసుకున్నారు. ప్రతి విద్యార్థి ప్రగతిని పర్యవేక్షిస్తూ డిసెంబర్ 6 నుంచి ప్రారంభమయ్యే వందరోజుల ప్రణాళికను పకడ్బందీగా అమలు చేసి పదో తరగతిలో 100 శాతం ఫలితాలు సాధించాలన్నారు. అనంతరం ఎమ్మార్సీ కేంద్రంలో రికార్డులు, హాజరు పట్టికలను పరిశీలించారు. ఈ నెలలో ఎంఈఓ-1 సునంద హాజరు నమోదు చేయకపోవడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. వెంటనే ఫేషియల్ రికగ్నిషన్ యాప్ ద్వారా హాజరు వివరాలు సేకరించాలని సిబ్బందికి ఆదేశించారు. మండల సందర్శనపై నిర్ధారణలో లోపాలు తేటతెల్లమైతే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎమ్మార్సీ కార్యాలయంలో ఎండిఓ మోహన్ కుమార్ డీఈఓను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం కేజీబీవీ పాఠశాలలో ఆరో తరగతి విద్యార్థులకు ఇంగ్లీష్ పాఠాన్ని బోధించి, వారు రాసిన పదాలను చదివించారు. ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయిని కృష్ణవేణికి విద్యార్థుల స్థాయికి అనుగుణంగా ఎలా బోధించాలో సూచనలు చేశారు. వంట గదిని పరిశీలించి, ఆహార నాణ్యత పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఎరుకలచెరువు ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసి నాణ్యతపై సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ చైతన్య స్రవంతి, సిబ్బంది పాల్గొన్నారు. **వెల్దుర్తి :** పదవ తరగతి పరీక్షల్లో జిల్లా వందశాతం ఫలితాలే లక్ష్యంగా కృషి చేయాలని డీఈవో శ్యామ్యుల్ పాల్ అన్నారు. వెల్దుర్తిలోని కేజీబీవీ పాఠశాలను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. పదవతరగతి విద్యార్థులతో మాట్లాడుతూ వత్తిడి లేకుండా చదవాలని, ప్రతి పాఠ్యాంశంపై అవగాహన కలిగి ఉండాలని, చదివినది జ్ఞాపకం ఉంచుకోవాలని, రాసేలా ప్రయత్నించాలని సూచించారు.

గుండ్రేవుల ప్రాజెక్టును చేపట్టాలి

- ప్రజా సంఘాల నాయకులు - ముగిసిన 48 గంటల జల సమర దీక్ష

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

మాట్లాడుతున్న జి.రామకృష్ణ

కూటమి ప్రభుత్వం కర్నూలు జిల్లాలో గుండ్రేవుల ప్రాజెక్టు నిర్మాణం వెంటనే చేపట్టాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. కెపిఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎం.శ్రీహర్ష కర్నూలు నగరంలోని ధర్నా చౌక్‌లో చేపట్టిన 48 గంటల జల సమర దీక్ష మంగళవారం ముగిసింది. రెండోరోజు దీక్షలో ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ, జిల్లా నాయకులు జి.ఆంజనేయులు, సాగునీటి సాధన సమితి నాయకులు బస్తిపాటి రామకృష్ణారెడ్డి, ఎఆర్కె డేవిడ్, జిల్లా మేధావుల ఫోరం వ్యవస్థాపక అధ్యక్షుడు మన్సూర్ రెహమాన్, ఎపిడబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర నాయకులు మద్దిలేటి, గోరంట్లప్ప, బిసి సంఘం సీనియర్ నాయకులు శేషఫణి, పిడిఎస్‌యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భాస్కర్, సిపిఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకులు నరసింహులు, పంచాయతీ రాజ్ చాంబర్ అసోసియేషన్ నాయకులు బిరు ప్రతాపరెడ్డి తదితరులు పాల్గొని మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో కరువును పారదోలేందుకు గుండ్రేవుల, వేదవతి ప్రాజెక్టులను, ఆర్‌డిఎస్ కుడి కాలువ పనులను చేపట్టాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎం.శ్రీహర్ష మాట్లాడుతూ గుండ్రేవుల ప్రాజెక్టు సాధనకు పోరాటాన్ని మరింత ముందుకు తీసుకు పోతామని పేర్కొన్నారు. అనంతరం ప్రజా సంఘాల నాయకులు శ్రీహర్షకు నిమ్మరసం అందజేసి దీక్షను విరమింపచేశారు. కార్యక్రమంలో కెపిఎస్ నాయకులు హరినాథ్, శ్రీనివాసులు, రామాంజనేయులు, నాగరాజు, బాబు పాల్గొన్నారు.

Women Empowerment Cell

సమావేశంలో మాట్లాడుతున్న లీల వెంకట శేషాద్రి

మహిళలపై జరుగుతున్న దాడులపై అవగాహన కలిగి ఉండాలి

- జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ప్రధాన కార్యదర్శి జస్టిస్ లీల వెంకట శేషాద్రి

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

మహిళలపై జరుగుతున్న దాడులు, హింసలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ప్రధాన కార్యదర్శి జస్టిస్ లీల వెంకట శేషాద్రి తెలిపారు. మంగళవారం కర్నూలు కెవిఆర్ డిగ్రీ కాలేజ్ ఆఫ్ క్లస్టర్ యూనివర్శిటీలో 'అంతర్జాతీయ స్త్రీ హింస వ్యతిరేక' దినోత్సవం నిర్వహించారు. లీల వెంకట శేషాద్రి, రాష్ట్ర మహిళా కమిషన్ మెంబర్ రూఖియ బేగం మాట్లాడారు. ఎవరికైనా న్యాయపరమైన సమస్యలు వస్తే 15100 టోల్ ఫ్రీ నెంబర్ కాల్ చేస్తే వారికి ఉచిత న్యాయ సహాయాన్ని అందించి వారి సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. సిఐ విజయలక్ష్మి మాట్లాడుతూ... సైబర్ చట్టాలు, క్రిమినల్ చట్టాల గురించి వివరించారు. అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ న్యాయవాది సులోచన... ఉచిత న్యాయ సేవలు, న్యాయ సేవాధికార సంస్థ నుంచి ఎలా పొందాలో వివరించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కెవి.వెంకట రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ రంగారెడ్డి, మహిళా సాధికారికత సెల్ అధ్యాపకులు డాక్టర్ పద్మావతి పాల్గొన్నారు.

మెడికవర్ హాస్పిటల్స్‌లో రూఖియా బేగం పరిశీలన : ఆంధ్రప్రదేశ్ మహిళా కమిషన్ సభ్యులు డాక్టర్ ఎస్‌కె.రుఖియా బేగం కర్నూలు మెడికవర్ హాస్పిటల్స్‌ను సందర్శించారు. ఆస్పత్రి అందిస్తున్న వైద్య సేవలు, మహిళల ఆరోగ్యం కోసం చేపడుతున్న కార్యక్రమాలు, సౌకర్యాలు, రోగులకు అందిస్తున్న సేవలపై పరిశీలించారు.

కాంగ్రెస్‌ను బలోపేతం చేయాలి

- ఎఐసిసి అబ్జర్వర్ హెచ్‌సి.యోగేష్

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలోపేతం చేసేందుకు కృషి చేయాలని కాంగ్రెస్ కేంద్ర కమిటీ పరిశీలకులు, ఎఐసిసి కార్యదర్శి హెచ్‌సి.యోగేష్ తెలిపారు. డిసిసి అధ్యక్ష పదవి కోసం ఎవరైనా దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. మంగళవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఎపిసిసి అబ్జర్వర్లు సాకే శంకర్, సొంటి నాగరాజుతో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కొత్త డిసిసిని ఎన్నుకునేందుకు కాంగ్రెస్ పార్టీ మంచి అవకాశం ఇచ్చిందని, పార్టీలో అర్హులైన వారు ఎవరైనా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. అసెంబ్లీ నియోజకవర్గాలకు వెళ్లి నాయకులను కలుస్తామన్నారు. ఈనెల 28 వరకు కర్నూలు డిసిసి అధ్యక్షుని నియామకానికి అందరి అభిప్రాయాల మేరకు అధిష్టానం కొత్త డిసిసిని నియమిస్తామన్నారు. మాజీ ఎమ్మెల్సీ, ఎఐసిసి సభ్యులు ఎం.సుధాకర్ బాబు, మాజీ డిసిసి అధ్యక్షులు కె.బాబురావు, యూత్ కాంగ్రెస్ జాతీయ కార్యదర్శి జి.నాగ మధు యాదవ్, సిటీ కాంగ్రెస్ అధ్యక్షులు షేక్ జిలాని బాషా, ఐఎన్‌టియుసి రాష్ట్ర అధ్యక్షులు సయ్యద్ ఖాద్రీ బాషా, నియోజకవర్గాల కోఆర్డినేటర్లు ఎం.ఖాసీంవలీ, బి.క్రాంతి నాయుడు, అనంతరత్నం మాదిగ, ఐఎన్‌టియుసి జిల్లా అధ్యక్షులు బి.బతుకన్న, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు ఎన్‌సి.బజారన్న పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యా రంగం బలోపేతానికి పోరాటం

- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మాజీ నాయకులు ఆనంద్‌బాబు

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

విద్యను సామాజిక హక్కుగా కాకుండా కార్పొరేట్ ఉత్పత్తిగా మారుస్తున్న కూటమి ప్రభుత్వం మారుస్తున్న తరుణంలో ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం కోసం పోరాడదామని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మాజీ నాయకులు ఎమ్‌డి.ఆనంద్ బాబు తెలిపారు. మంగళవారం ఎస్ఎఫ్ఐ కర్నూలు నగర మహాసభ స్థానిక కెకె భవన్లో నిర్వహించారు. మహాసభ ప్రారంభ సూచికగా స్వాతంత్ర్యం, ప్రజాస్వామ్యం, సోషలిజం లక్ష్యాలతో కూడిన జెండాను నగర అధ్యక్షులు అబుబక్కర్ ఎగరవేశారు. అనంతరం మహాసభను ఉద్దేశించి ఎస్ఎఫ్ఐ పూర్వ రాష్ట్ర నాయకులు ఆనంద్ బాబు , ఎస్ఎఫ్ఐ కర్నూలు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సాయి, రంగప్ప మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం విద్యను సామాజిక హక్కుగా కాకుండా మార్కెట్ ఉత్పత్తి వస్తువుగా మారుస్తుందన్నారు. ప్రస్తుత విద్యారంగం అత్యంత సంక్షోభంలో ఉందన్నారు. ప్రభుత్వం ప్రజా విద్యను బలోపేతం చేయాల్సిన సమయంలో కేవలం దానిని వ్యాపారంగా మార్చే ప్రైవేటీకరణ విధానాలు వేగంగా విస్తరిస్తున్నాయి. దీని ఫలితంగా పేద, మధ్యతరగతి విద్యార్థులు నాణ్యమైన విద్యకు చేరుకోలేని పరిస్థితి ఏర్పడుతుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ పాఠశాలలు మూసివేతకు గురవుతుండగా, పట్టణ లో ప్రైవేట్ విద్యాసంస్థలు అధిక ఫీజులు వస్తువులు చేస్తూ విద్యను వ్యాపారంగా మార్చి విద్యార్థులపై ఆర్థిక భారాలు వేస్తూ అనేకమంది విద్యార్థులను చదువుకు దూరం చేస్తుందన్నారు. ప్రభుత్వ విద్యా రంగం బలహీనపడడంతో సమాజంలో అసమానతలు మరింత పెరుగుతాయన్నారు.

SFI
SFI
SFI
నగర మహాసభ

మహాసభలో మాట్లాడుతున్న ఆనంద్‌బాబు

నూతన నగర కమిటీ ఎన్నిక: నూతన ఎస్ఎఫ్ఐ కర్నూలు నగర కమిటీని ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షులుగా ఆర్యన్, నూతన కార్యదర్శిగా అంజి , ఉపాధ్యక్షులుగా అబ్బు, పద్వి, భాస్కర్, శ్రీలక్ష్మి, సహాయ కార్యదర్శులుగా యోగి, ఉదయ్, రమేష్, సాయి, దీపిక, 20 మంది కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.

సమస్యలు పరిష్కరించకపోతే

ఆర్‌డిఒ కార్యాలయ దిగ్బంధం

- సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు రామకృష్ణ

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్

మండలంలోని ప్రజా సమస్యల పరిష్కరించకపోతే ఆర్‌డిఒ కార్యాలయాన్ని దిగ్బంధిస్తామని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు జి.రామకృష్ణ హెచ్చరించారు. మంగళవారం కర్నూలు రూరల్ తహశీల్దార్ కార్యాలయం ముందు మండల నాయకుడు రాఘవేంద్ర అధ్యక్షతన ధర్నా చేపట్టారు. రామకృష్ణ, సిపిఎం మండల కార్యదర్శి హుస్సేనయ్య మాట్లాడుతూ... కర్నూలు మండలాభివృద్ధికి నిధులు కేటాయించాలని, రైల్వే వ్యాగిన్ వర్క్ షాప్ పూర్తి చేసి యువతకు ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతుల పంటలకు సాగు నీరందించాలని, ఉల్లి రైతులకు ప్రభుత్వం ఇస్తానన్న హెక్టార్‌కు రూ.50 వేలు వెంటనే ఇవ్వాలని కోరారు. జాతీయ రహదారులు, రాష్ట్ర రహదారుల కోసం రైతుల నుంచి తీసుకున్న భూములకు వెంటనే పరిహారం ఇవ్వాలని, రైతుల పొలాలకు సర్వీస్ రోడ్లు వేయాలని, కల్వర్టులు నిర్మించాలని డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కరించకపోతే ఆర్‌డిఒ కార్యాలయాన్ని దిగ్బంధిస్తామని హెచ్చరించారు. అనంతరం తహశీల్దార్ రమేష్ బాబుకు వినతిపత్రం అందజేశారు. తహసిల్దార్ స్పందిస్తూ... తన పరిధిలో ఉన్న సమస్యలను పరిష్కరిస్తామని, మిగతా సమస్యలను ప్రభుత్వం, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. సిపిఎం మండల నాయకులు బాలపీరా, శ్రీరాములు, నరసింహులు, ఆంజనేయులు, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అబ్దుల్లా, నాయకులు, హరికిషన్ రెడ్డి, ప్రకాష్, రాము, విశ్వనాథ్, మస్తాన్, శంకర్, చంద్రన్న పాల్గొన్నారు.

తహశీల్దార్ రమేష్‌కు వినతిపత్రం అందిస్తున్న సిపిఎం నాయకులు

మెడికల్ కాలేజీలను ప్రయివేట్ పరం చేయవద్దు

- 47వ వార్డులో కోటి సంతకాల సేకరణ

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

మెడికల్ కాలేజీలను ప్రయివేట్‌పరం చేయవద్దని వైసిపి జిల్లా అధ్యక్షులు ఎస్‌వి.మోహన్ రెడ్డి తెలిపారు. మంగళవారం కర్నూలు నియోజకవర్గం 47వ వార్డు ధర్మపేటలో కోటి సంతకాల సేకరణ చేపట్టారు. **వెల్దుర్తి** పట్టణంలోని అనకల వీధి 11వ వార్డులో మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ చేపట్టారు. పత్తికొండ మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి, వైసిపి మండల కన్వీనర్ రవిరెడ్డి, సర్పంచి ముత్యాల శైలజ, జడ్‌పిటిసి సుంకన్న పార్టీ నాయకులతో కలిసి వీధుల్లో తిరిగి కోటి సంతకాల సేకరణపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం రచ్చబండ నిర్వహించి మాట్లాడారు. జిల్లా అధికార ప్రతినిధి సమీర్ కుమార్ రెడ్డి, ఆర్‌టిఐ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొత్తూరు వెంకటేశ్వర రెడ్డి పాల్గొన్నారు. పట్టణానికి చెందిన వైసిపి కార్యకర్త నాగిరెడ్డి తండ్రి అనారోగ్యంతో బాధపడుతూ కొద్దిరోజుల క్రితం మృతి చెందారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.

వెల్దుర్తి : సంతకాలు సేకరిస్తున్న మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి

రూ.14.6 కోట్లతో విశ్రాంతి సదన్

- త్వరలో నిర్మాణ ప్రారంభానికి సన్నాహాలు

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

కర్నూలు ప్రభుత్వాస్పత్రి ఆవరణలో రోగుల అటెండెంట్ల కోసం నిర్మించే విశ్రాంతి సదన్ పనులపై ఆస్పత్రి అడిషనల్ డిఎంఇ, సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు మంగళవారం సమీక్ష నిర్వహించారు. రూ.14.6 కోట్లతో పవర్ గ్రిడ్ కార్పొరేషన్ సిఎస్ఆర్ నిధుల సహకారంతో స్టేట్ క్యాన్సర్ ఇనిస్టిట్యూట్ సమీపంలో ఎన్‌బిసిసి ఆధ్వర్యంలో నిర్మించే ఆధునిక 'విశ్రాంతి సదన్' మాస్టర్ ప్లాన్ నమూనా, డిజైన్‌ను పవర్ గ్రిడ్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ ప్రాజెక్టు 18 నెలల్లో పూర్తవుతుందన్నారు. ఆస్పత్రి అడ్మినిస్ట్రేటర్ సింధు సుబ్రహ్మణ్యం, పవర్ గ్రిడ్ కార్పొరేషన్ డిప్యూటీ జనరల్ మేనేజర్ శ్రీనివాస్ మూర్తి, డిప్యూటీ జనరల్ మేనేజర్ ఇంజినీరింగ్ అబ్దుల్ రహీమ్, బిల్డింగ్ ఆర్కిటెక్ట్ హర్షవర్ధన్ పాల్గొన్నారు.

ఒపి విభాగాల తనిఖీ : ప్రభుత్వాస్పత్రిలోని పలు విభాగాలను సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు ఆకస్మికంగా తనిఖీ చేశారు. జనరల్ మెడిసిన్, ఆర్థో, జనరల్ సర్జరీ, ఇఎన్‌టి, సైకియాట్రి, సూపర్ స్పెషాలిటీ, గైనిక్, పీడియాట్రిక్, తదితర ఒపి విభాగాలను తనిఖీ చేశారు. ఆర్థో విభాగంలో రోగికి సంబంధించిన రిజిస్టర్ సక్రమంగా మెయింటెన్ చేయాలని వైద్యులను ఆదేశించారు. డిప్యూటీ సూపరింటెండెంట్లు డాక్టర్ లక్ష్మీబాయి, డాక్టర్ నాగేశ్వరరావు, సిఎస్ఆర్ఎంఒ డాక్టర్ పద్మజ, డిప్యూటీ సిఎస్ఆర్ఎంఒ డాక్టర్ పద్మజ, ఆర్ఎంఒ డాక్టర్ వెంకటరమణ, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ శివబాల, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కిరణ్ కుమార్, ఎఆర్ఎంఒఎస్ డాక్టర్ క్లింటన్, డాక్టర్ సునీల్ ప్రశాంత్ పాల్గొన్నారు.

విశ్రాంత సదన్ నమూనా ఆవిష్కరిస్తున్న డాక్టర్ వెంకటేశ్వర్లు

మాట్లాడుతున్న పి.నిర్మల

ఆర్‌పిలకు కనీస వేతనం అమలు చేయాలి

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

మెప్మాలో పని చేసే ఆర్పిలకు కనీస వేతనం అమలు చేయాలని శ్రామిక మహిళా సంఘం జిల్లా కన్వీనర్ నిర్మల డిమాండ్ చేశారు. ఏపీ మెప్మా ఆర్పి ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో కొనసాగుతున్న నిరసన మంగళవారం కూడా యథావిధిగా కొనసాగింది. ఈ నిరసనలో పాల్గొన్న పీ నిర్మల మాట్లాడుతూ ఆర్పిలకు పొదుపు గ్రూపులు సభ్యులు బ్యాంకు లింకేజీ లోన్ రికవరీ ఆన్లైన్ మీటింగ్ వాటితోనే ఆర్పిల పని ఉంటుందన్నారు. పొదుపు గ్రూపులకు సంబంధం లేని కార్యక్రమాల్లో సమీకరణ పేరుతో, పురమిత్ర ప్రజ్ఞ టిడ్కో ఇల్లు మొదలైన ఇతర పనులు చెబుతూ ఆర్పిలను ఒత్తిడి చేయటం సరికాదన్నారు. మహిళా మార్ట్‌కు చెల్లించిన డబ్బులు విచారించి మూతకు కారణమైన ఆనాటి పిడి మెప్మా అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఐద్వా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్యామల, కె.అరుణమ్మ మాట్లాడుతూ మహిళా మార్ట్ మూసే యడానికి కారణమైన నిర్వహణలో బాధ్యత రహితంగా వ్యవహరించిన మెప్మా అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి.రుద్రమ్మ ,ఉమాదేవి కోశాధికారి సుజాత ప్రసాద్ కన్యక నగర అధ్యక్ష కార్యదర్శులు లక్ష్మీబాయి, షబానా పాల్గొన్నారు.

గ్యాస్‌కు అదనంగా వసూలు చేయరాదు

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

వంటగ్యాస్ లబ్ధిదారుల నుంచి డెలివరీ బాయ్స్ సరఫరా సందర్భంగా అదనపు వసూలు చేయరాదని జెసి నూరుల్ కమర్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో ప్రధానమంత్రి ఉజ్వల యోజన కమిటీకి సంబంధించి సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ... అర్హులైన ప్రతి కుటుంబం ఈ పథకం ద్వారా ఉచిత గ్యాస్ కనెక్షన్ పొందే విధంగా చర్యలు వేగవంతం చేయాలన్నారు. అర్హులైన వారు రేషన్ కార్డు, ఐడెంటి ప్రూఫ్ తీసుకొని సమీప గ్యాస్ ఏజెన్సీకి వెళ్లి దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇన్‌చార్జ్ సివిల్ సప్లయిస్ అధికారి వెంకట రాముడు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలకు 30 వరకు గడువు : పీడీ

ప్రజాశక్తి - సి బెళగల్

ఇళ్ల నిర్మాణాలకు దరఖాస్తు చేసుకొనే ఆసక్తి గల వారికి ఈనెల 30 వరకు గడువు ఉందని హౌసింగ్ పీడీ చిరంజీవి తెలిపారు. మంగళవారం పలు గ్రామాల్లో హౌసింగ్ ఎఇ సుమంత్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రంగన్న సమక్షంలో ఇళ్ల నిర్మాణాలపై అవగాహన కల్పించారు. ఖాళీ స్థలం, బేస్ మట్టం పూర్తయి వదిలిన స్థలం ఉండాలని తెలిపారు. ఇది వరకు గతంలో బిల్లులు తీసుకున్న వారు అనర్హులని పేర్కొన్నారు. ఇప్పటికే మండలంలో 1,171 దరఖాస్తులు వచ్చాయని, ఆసక్తి కలిగిన వారు ఈనెల 30లోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

అధికారులతో మాట్లాడుతున్న నాయకులు

పెద్ద చెరువు సమస్యను పరిష్కరించాలి

- రైతుసంఘం జిల్లా అధ్యక్షులు వెంకటేశులు

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

పాండవగల్లు పెద్ద చెరువు సమస్యను పరిష్కరించాలని రైతుసంఘం జిల్లా అధ్యక్షులు కె.వెంకటేశులు డిమాండ్ చేశారు. మంగళవారం రైతన్నల కోసం మీ ప్రభుత్వం'లో భాగంగా గ్రామానికి వచ్చిన అగ్రికల్చర్, మార్కెట్ యార్డు అధికారులు, టిడిపి పార్లమెంట్ కార్యదర్శి భూపాల్ చౌదరిని వెంకటేశులు, వ్యకాస జిల్లా ఉపాధ్యక్షులు కె.లింగన్న, రైతుసంఘం, సిఐటియు నాయకులు జె.రామాంజనేయులు, పాండురంగ, హనుమంతు రెడ్డి, రైతాంగ సమస్యలు, పాండవగల్లు పెద్ద చెరువు సమస్యపై నిలదీశారు. ఆయన మాట్లాడుతూ... 2023-24కు సంబంధించిన పంట నష్ట పరిహారం ఇవ్వాలని, 2019 ఫిబ్రవరి తర్వాత ఆన్‌లైన్‌లో చేరిన రైతులకు పిఎం కిసాన్ వర్తింపజేయాలని కోరారు. కౌలు రైతులందరికీ అన్నదాత సుఖీభవ ఇవ్వాలని, ఉల్లి రైతులకు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. పత్తికి గిట్టుబాటు ధర కల్పించాలని, సిసిఐ కొనుగోలు కేంద్రాలు పెంచాలని కోరారు. అనంతరం టిడిపి నాయకులు భూపాల్ చౌదరి, ఎఒ సుధాకర్ మాట్లాడారు. రైతుల పంట నష్టపరిహారం, పిఎం కిసాన్‌కు సంబంధించిన అంశాన్ని జిల్లా ఉన్నతాధికారులు, మంత్రి అచ్చెన్నాయుడు దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. పాండవగల్లు పెద్ద చెరువు సమస్య పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని భూపాల్ చౌదరి హామీ ఇచ్చారు. నాయకులు కృష్ణ, హుస్సేని, నర్సిరెడ్డి, గోవిందు రెడ్డి, పకీరయ్య, మంజునాథ, తిక్కయ్య, మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

ప్రజారోగ్యమే ప్రభుత్వ లక్ష్యం : టిడిపి



పిహెచ్‌సిని ప్రారంభిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే, ఇన్‌ఛార్జీ

ప్రజాశక్తి - ఆలూరు

ప్రజారోగ్యమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎంపీ బస్తిపాటి నాగరాజు, టిడిపి ఇన్‌ఛార్జీ వైకుంఠం జ్యోతి తెలిపారు. రూ.2.73 కోట్ల నాబార్డ్ నిధులతో నిర్మించిన ఆలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని (సిహెచ్‌సి) మంగళవారం ఎంపీ నాగరాజు, ఎమ్మెల్యే బి.విరుపాక్షి, టిడిపి ఇన్‌ఛార్జీ వైకుంఠం జ్యోతి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం ఎంపీ నాగరాజు, ఇన్‌ఛార్జీ వైకుంఠం జ్యోతి మాట్లాడారు. ప్రజారోగ్యమే లక్ష్యంగా రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఆరోగ్య కేంద్రాల నిర్మాణం పూర్తి చేసినట్లు తెలిపారు. 30 పడకలతో నిర్మించిన ఆలూరు సిహెచ్‌సిని సక్రమంగా వినియోగించుకోవాలని కోరారు. ఆలూరు అభివృద్ధికి వేదవతి, నగరడోన పూర్తి చేసి ప్రజలకు తాగు, సాగునీరు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. మార్కెట్ యార్డు ఛైర్మన్ బిల్లేకల్ వెంకటేశ్వర్లు, జనసేన కోఆర్డినేటర్ రంజిత్ కుమార్, నాయకులు కృష్ణ యాదవ్, ఈరన్న, శీనప్ప, నాగప్ప, రామాంజిని పాల్గొన్నారు.

దేశవ్యాప్త నిరసనను జయప్రదం చేయండి

- కార్మిక సంఘాల నాయకులు

ప్రజాశక్తి - ఆదోని

మాట్లాడుతున్న కార్మిక సంఘాల నాయకులు

కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన లేబర్ కోడ్‌లు, రైతు వ్యతిరేక చట్టాలకు వ్యతిరేకంగా బుధవారం నిర్వహించే దేశవ్యాప్త నిరసనను జయప్రదం చేయాలని కార్మిక సంఘాల నాయకులు కోరారు. మంగళవారం సిఐటియు నాయకులు పిఎస్.గోపాల్ అధ్యక్షతన మున్సిపల్ గ్రౌండ్‌లో అన్ని కార్మిక సంఘాల సమావేశం నిర్వహించారు. ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు కె.అజయ్‌బాబు, ఐఎఫ్‌టియు జిల్లా కార్యదర్శి జి.ఎంకప్ప, సిఐటియు పట్టణ కార్యదర్శి తిప్పన్న, ఎఐటియుసి నాయకులు భీమేష్, బి.వెంకన్న హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం గతంలో ఉన్న కార్మిక వ్యతిరేక చట్టాలను తొలగించి లేబర్ కోడ్‌లు తీసుకొచ్చి కార్మికులకు తీవ్ర నష్టం కలిగిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. 8 గంటల పని విధానం పోయి లేబర్ కోడ్ వల్ల 13 గంటల పని విధానం అమలు జరుగుతుందని, కార్మిక వర్గానికి నష్టం జరుగుతుందని తెలిపారు. రైతు, కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా బుధవారం జరిగే నిరసనను జయప్రదం చేయాలని కోరారు. ఎఐటియుసి నాయకులు షేక్షావలీ, ఐఎఫ్‌టియు నరసన్న, కుమార్, మల్లికార్జున, ప్రసాద్ ఉన్నారు.

రైతు అభ్యున్నతికి కూటమి కృషి : ఎమ్మెల్యే బీవీ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

రైతు అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయ నాగేశ్వరరెడ్డి తెలిపారు. మంగళవారం 'రైతన్న మీకోసం'లో భాగంగా మండలంలోని గార్లదిన్నె గ్రామంలో ఎమ్మెల్యే బీవీ.జయనాగేశ్వర రెడ్డి పర్యటించారు. గ్రామంలో గడపగడపకు వెళ్లి ప్రభుత్వ కార్యక్రమాలపై రైతులకు అవగాహన కల్పించారు. ప్రభుత్వ పని తీరు పట్ల రైతుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే ఇంటింటికీ తిరుగుతూ రైతులకు 'అన్నదాత సుఖీభవ' పత్రాలను అందజేశారు. అనంతరం రచ్చబండ కార్యక్రమం నిర్వహించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. టిడిపి మండల కన్వీనర్ కెటి.వెంకటేష్, ఎమ్మిగనూరు మార్కెట్ యార్డు ఛైర్మన్ కె.మల్లయ్య పాల్గొన్నారు. **కౌతాళం** మండలంలోని నదిచాగి గ్రామంలో 'అన్నదాత సుఖీభవ విజయోత్సవం, ఇంటింటా టిడిపి కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి 'అన్నదాత సుఖీభవ' కరపత్రాలను అందజేసి పథకం ప్రయోజనాలను తెలిపారు. టిడిపి మంత్రాలయం ఇన్‌ఛార్జీ ఎన్.రాఘవేంద్ర రెడ్డి, మండల అధ్యక్షులు సురేష్ నాయుడు, తుంగభద్ర బోర్డు ఛైర్మన్ టిప్పు సుల్తాన్, సొసైటీ ఛైర్మన్ వెంకటపతి రాజు, బోయ మారెప్ప, యువ నాయకులు రాజరెడ్డి, సీనియర్ నాయకులు అడివప్ప గౌడ్, పట్టాభి, రామలింగ, పకీరయ్య, వలీ బాష, చంద్రప్ప గౌడ్, హనుమంతు, మహదేవ, కాత్రికి చంద్ర, మల్లయ్య, గిరి, మహాదేవ, రామన్న గౌడ్, కురువ నాగేష్, లక్కే గోవిందు, జనసేన రామాంజినేయులు, బిజెపి విజయ్ కుమార్, ఎంకప్ప, ఎఒ శేషాద్రి పాల్గొన్నారు. **నందవరం** గ్రామంలో ఇంటింటికీ తిరుగుతూ 'అన్నదాత సుఖీభవ' పత్రాలను అందజేశారు. టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు మాధవరావు దేశాయ్, సచివాలయ సిబ్బంది ఖాజా హుస్సేన్, తెలుగు ఈరన్న, చాకలి మల్లికార్జున, నాగరాజు, శ్రీనివాసులు, పంపయ్య, నరసింహులు పాల్గొన్నారు. **దేవనకొండ** మండలం కప్పట్రాళ్ల గ్రామంలో రైతన్న మీకోసం' నిర్వహించారు. ముఖ్యఅతిథిగా టిడిపి నాయకులు కప్పట్రాళ్ల మల్లికార్జున హాజరై మాట్లాడారు. 'అన్నదాత సుఖీభవ' ద్వారా రైతులకు పెట్టుబడి ఆర్థిక సహాయం, డ్రిప్ ఇరిగేషన్, గోకులం షెడ్, హార్టికల్చర్, రైతులకు ప్యాక్ హౌస్ వంటివి అందిస్తూ రైతులను అభివృద్ధి పథంలో నడిపిస్తున్నట్లు తెలిపారు. వ్యవసాయ శాఖ సిబ్బంది ప్రతి రైతూ ఇంటికి వెళ్లి పంట దిగుబడులపై రైతులతో మాట్లాడుతున్నట్లు పేర్కొన్నారు. విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ నాగన్న, గ్రామ రైతులు గంగన్న, గొర్ల సుంకన్న, రవికుమార్, రంగన్న, మద్దిలేటి, రాముడు, సుంకన్న, నాగరాజు పాల్గొన్నారు.



ఎమ్మిగనూరు : రైతులకు పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే బీవీ

కౌతాళం : మాట్లాడుతున్న రాఘవేంద్రరెడ్డి

నందవరం

దేవనకొండ

ఘనంగా శ్రీచెన్నకేశవస్వామి రథోత్సవం

- రూ.14 లక్షలతో నిర్మించిన సిసి రోడ్డు ప్రారంభం

ప్రజాశక్తి -ఆలూరు

మండలంలోని మొలగవల్లి గ్రామంలో వెలసిన శ్రీచెన్నకేశవ స్వామి రథోత్సవం మంగళవారం వైభవంగా జరిగింది. గ్రామస్తులు నైవేద్యాలతో స్వామి వారికి పూజలు నిర్వహించి రథోత్సవంలో స్వామి వారిని ప్రతిష్ఠించి పురవీధులగుండా రథోత్సవం నిర్వహించారు. టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ వైకుంఠం జ్యోతి పాల్గొని స్వామి వారికి పూజలు నిర్వహించారు. అనంతరం ఎంపిటిసి సునంద పటేల్ రూ.14 లక్షలతో నిర్మించిన సిసి రోడ్డును ప్రారంభించారు. సర్పంచి మోహన్ రాజు పాల్గొన్నారు.

సిసి రోడ్డును ప్రారంభిస్తున్న నాయకులు

ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

ఆలూరు మండలం మొలగవల్లి గ్రామంలో వెలసిన శ్రీచెన్నకేశవ స్వామి రథోత్సవం సందర్భంగా ఎమ్మెల్యే బి.విరుపాక్షి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ... గ్రామస్తులు నిత్యం పనుల్లో నిమగ్నమై ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తూ ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వారి కోసం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. వైసిపి మండల కన్వీనర్ మల్లికార్జున, నాయకులు ఈరన్న, రామాంజినేయిలు పాల్గొన్నారు.

వైద్య పరీక్షలు చేయించుకుంటున్న ఎమ్మెల్యే విరుపాక్షి

నేరాలపై అవగాహన సదస్సు

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

విద్యార్థినులు, మహిళలపై జరుగుతున్న నేరాలపై మండలంలోని పెద్దహరివాణం గ్రామంలో ఇస్వి పోలీసు స్టేషన్ ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా తాలూకా సిఐ నల్లప్ప, ఇస్వి ఎస్ఐ మహేష్ కుమార్ హాజరయి మాట్లాడారు. విద్యార్థినులు, మహిళలపై జరుగుతున్న నేరాలపై అవగాహన కల్పిస్తూ.. ఏదైనా సమస్య వచ్చినప్పుడు వెంటనే పోలీసులను సంప్రదించాలని కోరారు. 100కు డయల్ చేయాలని, ఎవరూ అధైర్య పడవద్దని తెలిపారు. ఎపిఎం కెసి.వీరన్న పాల్గొన్నారు.

STOP VIOLENCE
Against Women

మాట్లాడుతున్న తాలూకా సిఐ నల్లప్ప

వ్యాయామమూ అవసరం

- ఘనంగా వ్యాయామ ఉపాధ్యాయ దినోత్సవం

ప్రజాశక్తి - ఆదోని

చదువుతోపాటు విద్యార్థులకు వ్యాయామం కూడా అవసరమని భాష్యం స్కూల్ ప్రిన్సిపల్ సురేంద్ర బాబు తెలిపారు. మంగళవారం పట్టణంలోని భాష్యం ఉన్నత పాఠశాలలో ప్రిన్సిపల్ సురేంద్రబాబు ఆధ్వర్యంలో వ్యాయామ ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. వ్యాయామ ఉపాధ్యాయులు శంకర్, పవిత్రను సన్మానించారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ... భారతీయ వ్యాయామ విద్యా పితామహుడు హెర్రిక్రోబిక్ జయంతి సందర్భంగా వివిధ రకాల ఆటల పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. వ్యాయామ విద్య శారీరకంగా బలంగా ఉండడానికి, మానసిక బలానికి తోడ్పడుతుందన్నారు. ప్రధానోపాధ్యాయులు శిరీష, భార్గవ్, పవన్ పాల్గొన్నారు.

వ్యాయామ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న సిబ్బంది

నారా లోకేష్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న కృష్ణమ్మ

ఆదోని అభివృద్ధికి మంత్రి లోకేష్ హామీ

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని నియోజకవర్గ అభివృద్ధికి సహకరిస్తామని మంత్రి లోకేష్ హామీ ఇచ్చారని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గుడిసె ఆది కృష్ణమ్మ తెలిపారు. మంగళవారం మంగళగిరిలో లోకేష్‌ను కలిసి ఆదోనిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను విన్నవించామని ఆమె తెలిపారు. ఆమె మాట్లాడుతూ... ఆదోని జిల్లా ఏర్పాటుకు పునరాలోచించాలని కోరారు. 44 గ్రామాలు కలిగి ఒకే మండలంగా ఉందని, ఆదోనిని 3 మండలాలుగా విభజన చేయాలని కోరామన్నారు. రోడ్లు, డ్రెయినేజీ, తాగునీరు, వీధి దీపాలు వంటి సమస్యలను పరిష్కరించాలని కోరామన్నారు.

బెల్డోన సింగిల్ విండో అధ్యక్షునిగా రామాంజనేయులు

ప్రజాశక్తి - చిప్పగిరి

బెల్డోన సింగిల్‌విండో నూతన అధ్యక్షులుగా తనను అధికారికంగా ప్రకటించినట్లు ఆదేశాలు వచ్చాయని చిప్పగిరికి చెందిన కొండా రామాంజనేయులు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ వైకుంఠం జ్యోతి, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి వైకుంఠం శివప్రసాద్ అధికారికంగా ప్రకటించారని, వైకుంఠం జ్యోతి దంపతులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఇన్‌ఛార్జీ ఆదేశాల మేరకు మండలంలోని బెల్డోన సొసైటీ బ్యాంకును అభివృద్ధి పథంలో నడిపిస్తామని చెప్పారు. రైతులందరికీ అందుబాటులో ఉండి సొసైటీ సేవలు విస్తరించి, సొసైటీ బ్యాంకులో రుణాలు విరివిగా పొందేలా కృషి చేస్తామన్నారు.

శివ ప్రసాద్‌తో కొండా రామాంజనేయులు (ఫైల్)

కొత్త మండలంగా పెద్దహరివాణం

- పోరాడి సాధించుకున్న గ్రామస్తులు
- పార్టీలు, జెండాలు పక్కన పెట్టి ఒక్కటై సాధించిన విజయం

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

ఆదోనిలోని పెద్దహరివాణం గ్రామం మండలంగా అవతరించింది. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన జిల్లాల పునర్విభజన, డివిజన్లు, మండలాల మార్పుచేర్పులపై సచివాలయంలో జరిగిన సమీక్షలో పెద్దహరివాణాన్ని మండలంగా ప్రకటిస్తూ నిర్ణయం తీసుకున్నారు. గత మూడు నెలలుగా గ్రామస్తులంతా పార్టీలు, జెండాలు పక్కన పెట్టి ఒక్కటై సాధించిన విజయం ఇది. మంగళవారం గ్రామస్తులు సంబరాలు చేసుకున్నారు. ముందుగా గ్రామంలో బైక్ ర్యాలీ నిర్వహించి, గ్రామంలో వాల్మీకి, కనకదాసు, వైఎస్ఆర్, గాంధీ, అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి బాణసంచా కాల్చారు. పెద్దహరివాణం మండల సాధన కమిటీ సభ్యులు మాట్లాడుతూ... గ్రామంలో గ్రామస్తులంతా ఒక్కటై మూడు నెలలుగా బైక్ ర్యాలీ, రాస్తా రోకోలు, ధర్నాలు, గ్రామమంతా సంపూర్ణ బంద్ నిర్వహించారు. 14 గ్రామాలతో కలిసి గ్రామంలో భారీ బహిరంగ సభ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే పార్థసారథి హాజరయ్యారు. కలెక్టర్ కార్యాలయానికి, ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయానికి వినతి పత్రాలు సమర్పించారు. సాధన కమిటీ సభ్యుల బృందం మూడు సార్లు విజయవాడకు వెళ్లి మంత్రుల బృందం దఫాలవారీగా కలిసి పెద్ద హరివాణం గ్రామాన్ని మండలంగా ఏర్పాటు చేయాలని విన్నవించారు. ఆదోని పట్టణ నడిబొడ్డున 9 రోజులపాటు రిలే నిరాహార దీక్షలు కూడా చేపట్టారు. జిల్లాలోనే పోరాడి సాధించిన విజయంగా పెద్ద హరివాణం గ్రామం నిలిచిందని కొందరు కొనియాడారు.

గ్రామంలో ప్రత్యేకతలు...

మండలంలోని అతి పెద్ద గ్రామంగా పెద్దహరివాణం ఉంది. విస్తీర్ణంలో పెద్ద గ్రామం, ఓటర్ల సంఖ్య 7500, జనాభా 11వేలు. గ్రామంలో 12 ఏళ్లకోసారి జరిగే శ్రీగర్జిలింగేశ్వర దేవర గ్రామస్తులంతా కలిసికట్టుగా నిర్వహిస్తారు. ప్రతేడాది శ్రీరామనవమికి శ్రీఆంజనేయ స్వామి రథోత్సవం నిర్వహిస్తారు. ఐదేళ్లకోసారి శ్రీదేవమ్మవ్వ దేవర, నిర్వహిస్తారు. ఏ పండగ వచ్చినా గ్రామస్తులంతా కలిసి నిర్వహిస్తారు. గ్రామానికి ప్రత్యేకత ఇది.

జిల్లా ఇస్తామంటే రాజీనామాకు సై

- మంత్రాలయం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

ప్రజాశక్తి - ఆదోని

ఆదోనిని జిల్లాగా చేస్తామంటే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసేందుకు సిద్ధమని మంత్రాలయం ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి తెలిపారు. ఆదోనిలో జిల్లా సాధన సమితి చేపట్టిన దీక్ష శిబిరానికి మంగళవారం ఆయన మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి మాట్లాడారు. వైసిపి హయాంలోనే ఆదోని జిల్లా కావాల్సి ఉండగా అనివార్య కారణాల వల్ల కార్యరూపం దాల్చలేదన్నారు. కొత్త జిల్లాల ఏర్పాటుకు కూటమి ప్రభుత్వం ముందుకు రావడంతో ఆదోనిని జిల్లా చేయాలని డిమాండ్ చేశారు. మార్కాపురం, మదనపల్లె కొత్త జిల్లాలతో పాటు ఆదోనిని కూడా జిల్లాగా ప్రకటించాలని కోరారు. నంద్యాల జిల్లాలో ఉన్న ఆత్మకూరును మార్కాపురంలో కలిపే ప్రయత్నాన్ని ప్రభుత్వం విరమించుకోవాలన్నారు. జిల్లాతోనే ఈ ప్రాంతం ప్రగతి సాధిస్తుందని తెలిపారు. పది రోజులుగా దీక్షలు చేస్తున్నా ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదోనిని జిల్లాగా ప్రకటించకుండా కాలయాపన చేయడం తగదన్నారు. జిల్లా సాధన కోసం ప్రజా ఉద్యమాలకు సహకారం అందిస్తామని తెలిపారు. ఆదోని జిల్లా కోసం కూటమి ఎమ్మెల్యేలు ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు. పార్టీలు వేరైనా ఈ ప్రాంత అభివృద్ధి కోసం కలిసి రావాలన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదోని జిల్లాగా ఏర్పాటు చేస్తామంటే ప్రజా ఉద్యమానికి మద్దతు తెలుపుతూ తాను ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయడానికి కూడా సిద్ధమని తెలిపారు. ఆదోని జిల్లా ఏర్పాటుకు తాము మొదటి నుంచి అనుకూలంగానే ఉన్నామని చెప్పారు. చివరి వరకు ఉద్యమిస్తామని తెలిపారు. వీరశైవ యువజన సంఘం సభ్యులు దీక్షలో కూర్చున్నారు. జిల్లా సాధన సమితి నాయకులు ఆదినారాయణ రెడ్డి, న్యాయవాది లలిత కృష్ణ మూర్తి గౌడ్, మధు, దస్తగిరి నాయుడు, న్యాయవాది నాగరాజు ఉన్నారు.

మద్దతు తెలుపుతున్న ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

జిల్లా సాధన దీక్షకు సంఘీభావం తెలుపుతున్న బీటీ

ప్రజల ఆకాంక్షను సిఎం దృష్టికి తీసుకెళ్తాం

- ఎమ్మెల్సీ బీటీ.నాయుడు

ప్రజాశక్తి - ఆదోని

జిల్లా చేయాలన్న ఆదోని ప్రజల ఆకాంక్షను ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్తానని ఎమ్మెల్సీ బీటీ.నాయుడు తెలిపారు. ఆదోనిని జిల్లా చేయాలని పట్టణంలోని భీమాస్ సర్కిల్‌లో చేపట్టిన రిలే నిరాహార దీక్ష శిబిరాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ బీటీ మాట్లాడారు. రెండో ముంబయిగా పేరుగాంచిన ఆదోని ప్రస్తుతం అభివృద్ధికి నోచుకోవడం లేదని, ఆదోనిని జిల్లాగా ఏర్పాటు చేయాలని కోరారు. యువగళం పాదయాత్రలో భాగంగా లోకేష్ ఆదోనికి వచ్చిన సందర్భంగా జిల్లా ఏర్పాటు విషయంపై మాట్లాడినట్లు తెలిపారు. గత ప్రభుత్వం జిల్లాలు విభజించడంలో ఆదోనికి అన్యాయం చేసిందన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న అప్పులను తీరుస్తూ పరిపాలిస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు నడిపేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అహర్నిశలు కృషి చేస్తున్నారని చెప్పారు. ఆదోని జిల్లా ఏర్పాటుకు ఉన్న విషయాలను ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్ దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. పల్లెపాడు రామిరెడ్డి, కోసిగి ముత్తురెడ్డి, ఆదినారాయణ రెడ్డి, న్యాయవాది లీలావతి, శంకరప్ప, నాగరాజు స్వామి, మహాదేవ్, రమేష్, వెంకోబా, కుమారస్వామి, గోపి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

భూమిపూజలో పాల్గొన్న నాయకులు

ఆలయ గోపురం నిర్మాణానికి భూమిపూజ

ప్రజాశక్తి - నందవరం

నందవరం గ్రామంలో వెలసిన శ్రీమాతా బంగారమ్మ అవ్వ దేవాలయ గోపురం నిర్మాణానికి మంగళవారం భూమి పూజ చేశారు. గ్రామ పెద్దలు, ప్రజలు, పురోహితులు సూగూరు గోపాల్ స్వామి, ఆలయ కార్య నిర్వాహకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వాహకులు మాట్లాడారు. ఆలయ గోపురం నిర్మాణానికి దాదాపు రూ.15 లక్షలు ఖర్చు అవుతుందని తెలిపారు. ఇటీవల రూ.5 లక్షలతో కుమ్మరి వీధి దగ్గర శ్రీమాతా బంగారమ్మ అవ్వ దేవాలయ ముఖ ద్వారం నిర్మించామన్నారు. ఆలయ పూజారి సంజీవ నాయుడు, ఆలయ పెద్దలు దేవుళ్ల పెద్ద రామన్న, చుక్క మల్లేష్, ఒంటెద్దు మల్లేష్, ఎన్.లింగమూర్తి, వీరేష్, గడ్డం చిన్న రాముడు, రాజోలి, భీమశేఖర్, బండెడ్డి రాజు, పూజారి బంగారి, దండు నాగరాజు, రాజోలి నాగేష్, గుంటెప్ప, గుడిసి రాముడు, గడ్డం నాగప్ప, మాలే గురురాజ్, వడ్డే గోపాల్ పాల్గొన్నారు.

ఈనాడు విలేకరి నిజాయితీ

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలోని శ్రీరాఘవేంద్ర స్వామి మఠంలో దొరికిన సెల్‌ఫోన్‌ను భక్తులకు అప్పగించి ఈనాడు దినపత్రిక విలేకరి శ్రీధర్ స్వామి నిజాయితీ చాటుకున్నారు. మంగళవారం స్థానిక పోలీసు స్టేషన్‌లో ఎస్ఐ శివాంజల్ చేతుల మీదుగా బాధితులకు అప్పగించారు. విధుల్లో భాగంగా కార్యక్రమాల కవరేజ్‌కు వెళ్లిన విలేకరికి సెల్‌ఫోన్ దొరికింది. పోలీసు స్టేషన్‌లో సమాచారం అందించారు. కర్ణాటక రాష్ట్ర రాజధాని బెంగళూరుకు చెందిన వెంకటేష్ కుమారుడు శ్రీనివాస్ కుటుంబ సభ్యులతో కలిసి స్వామి వారి దర్శనార్థమై మంత్రాలయం వచ్చిన నేపథ్యంలో శ్రీమఠం మధ్య కారిడార్ మార్గంలో తన ఫోన్ పడిపోగొట్టుకున్నారు. సంబందిత ఫోన్‌ను ఎస్ఐకి అప్పగించగా ఎస్ఐ వారిని పిలిపించి, విచారించి ఆయన ఫోనే అని నిర్ధారించి బాధితునికి అప్పగించారు. సెల్‌ఫోన్ అప్పగించిన విలేకరిని ఎస్ఐ శివాంజల్ అభినందించారు.

బాధితునికి సెల్‌ఫోన్ అందజేస్తున్న ఎస్ఐ

మహిళలకూ సమాన హక్కులు కల్పించాలి

- ఎంపిడిఒ గీతావాణి

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ గీతా వాణి

ప్రజాశక్తి - ఆస్పరి

సమాజంలో పురుషులతో సమానంగా మహిళలకు హక్కులు కల్పించాలని ఎంపిడిఒ గీతావాణి తెలిపారు. మంగళవారం స్థానిక వెలుగు కార్యాలయంలో ఎపిఎం జనార్ధన్ అధ్యక్షతన జాతీయ లింగ సమానత్వం, నయీ చేతన్ 4.0 కార్యక్రమం నిర్వహించి, మహిళలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మహిళలను వంటింటికే పరిమితం చేయకుండా విద్య, ఆర్థికంగా, రాజకీయంగా సమానంగా హక్కులు కల్పించి, ప్రోత్సహించినప్పుడే మహిళలు ఉన్నత శిఖరాలకు చేరుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు. స్త్రీలు పురుషులకు ఏమాత్రం తీసి పోరని తెలిపారు. అనంతరం వెలుగు కార్యాలయం నుంచి పురవీధుల గుండా ర్యాలీ నిర్వహించారు.

బ్రాహ్మణులపై దూషణలకు పాల్పడితే సహించేది లేదు : బ్రాహ్మణ సంఘం

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

బ్రాహ్మణులపై అవాక్కులు, దూషణలకు పాల్పడితే సహించేది లేదని ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ మాజీ డిఎల్ఒ కరణం గురు రాఘవేంద్రరావు, ఎమ్మిగనూరు బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు రఘునందన్, నాయకులు వాసుదేవా చార్, నటరాజ శాస్త్రి, హనుమంతరావు తెలిపారు. మంగళవారం పట్టణ సిఐ శ్రీనివాసులుకు ఫిర్యాదు చేశారు. ఇటీవల డప్పు చంద్రన్న సమస్మరణ సభలో వల్లవోలు రమణ అనే గాయకుడు బ్రాహ్మణ జాతిని, బ్రాహ్మణ ఆచార వ్యవహా రాలను కించపరుస్తూ పాట పాడడం దారుణమని తెలిపారు. ఇతర కులాలు, మతాలను కించపరిచే విధంగా మాట్లాడడం సబబు కాదన్నారు. బ్రాహ్మణులను కించపరిచే విధంగా పాట లు పాడుతున్న వల్లబోలు రమణ, సభ్యులు జీడి నరసయ్య భారత నాస్తిక సమాజం సభ్యులపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. బ్రాహ్మణులను కించపరచే విధంగా పాడిన పాటను యూట్యూబ్ నుంచి తొలగించాలని, దీనిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

సిఐకి ఫిర్యాదు చేస్తున్న బ్రాహ్మణ సంఘం నాయకులు

పరిశుభ్రతలో ప్రజల భాగస్వామ్యం అవసరం

- మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

పరిశుభ్రతలో ప్రజలు భాగస్వామ్యం కావాలని మున్సిపల్ కమిషనర్ ఎన్.గంగిరెడ్డి కోరారు. మంగళవారం పట్టణంలోని ఎస్ఎంటి కాలనీ, ఆదోని బైపాస్ రోడ్డు ప్రాంతంలో పారిశుధ్య పనులు, రోడ్లు, డ్రెయిన్లు, ట్యాక్స్ కలెక్షన్ తదితర పనులను పరిశీలించారు. ప్రజలు తడి, పొడి చెత్తను వేరు చేసి ఇవ్వాలని తెలిపారు. అలాగే పట్టణంలోని శిల్పా కాలనీ, అయ్యప్ప స్వామి ఆలయం ప్రాంతంలో ఉన్న పార్కు పరిశీలించారు.

'బాధిత కుటుంబాలకు ఉద్యోగాలివ్వాలి'

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

వినతి పత్రం అందజేస్తున్న సిఐటియు నాయకులు

మున్సిపాలిటీ పరిధిలో పని చేస్తూ మృతి చెందిన పారిశుధ్య కార్మికుల కుటుంబ సభ్యులకు ఉద్యోగాలు ఇవ్వాలని మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్షులు కె.ఇస్మాయిల్, నాయకులు కె.ఖాజా, సిఐటియు మండల అధ్యక్ష, కార్యదర్శులు పి.గోవిందు, బి.రాముడు కోరారు. మంగళవారం మున్సిపల్ కార్మికుల ఆధ్వర్యంలో కమిషనర్ గంగిరెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. కమిషనర్ గంగిరెడ్డి మాట్లాడుతూ... 2020 సంవత్సరం నుంచి మృతి చెందిన కుటుంబాల సభ్యులకు ఉద్యోగాలివ్వాలని సిఫార్సు చేస్తున్నామని.. ఉన్నతాధికారుల మార్పులు జరగడం వల్ల సిఫార్సు లెటర్స్ ఆలస్యమైందని తెలిపారు. మృతి చెందిన కార్మికుల కుటుంబ సభ్యుల నియామక ఉత్తర్వులు త్వరలో వస్తాయని, కుటుంబ సభ్యులకు త్వరలో ఉద్యోగాలు ఇస్తామని చెప్పారు. యూనియన్ నాయకులు యు.రమేష్, బి.రంగస్వామి, బి.మునీంద్ర, బడేసాబ్, గోరు బాష, ఆరిఫ్, యు.లక్ష్మన్న, బి.గోపాల్, ఎం.తిక్కయ్య, ఈరన్న పాల్గొన్నారు.

ఎస్‌టియు జిల్లా కార్యదర్శికి సన్మానం

ప్రజాశక్తి - ఆదోని

ఎస్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన ఎంసి.సుంకన్నను మంగళవారం ఆదోనిలో ఉపాధ్యాయులు అభినందించారు. జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఈ ప్రాంత వాసి ఎన్నిక కావడం పట్ల ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. చిన్న సుంకన్నను ఆదోని, కౌతాళం మండల శాఖల తరపున సన్మానించారు. సుంకన్న మాట్లాడుతూ... ఉపాధ్యాయులకు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

IN THE COURT OF THE ADDL
SENIOR CIVIL JUDGE : KURNOOL
O.S.NO. 56/2024

Between:
M.Haroon Hussain. ...Plaintiff
VERSUS
S.M Rafeek Ahmed. ...Defendant
TO
S.M Rafeek Ahmed
s/o S.Imran Saheb, aged about 45 years,
occ: Business R/o plot No. 203, A Block,
Elkuri Bangla, Ulchala road,
Kallur Mandal, Kurnool.
cell No. 996605948.

పై కోర్టు యందు వాది తనకి రావలసిన ప్రామిసరీ నోట్లు వసూలు నిమిత్తము నీపై పై దావా దాఖలు చేసియుంటున్నాడు. సదరు దావా పైన నీకు ఏమైనా ఆక్షేపణలు ఉన్నయెడల తేదీ:17.12.2025 ఉదయం 10:30 ని॥లకు పై కోర్టు యందు హాజరై తెలుపు కొనవలెను. లేనిచో నీ పరోక్షమున విచారించి తీర్మానించబడును.

వాయిదా తేదీ : 17.12.25

వాదిపరం అడ్వకేట్
శ్రీ గౌతమ్ కోటి ,
అడ్వకేట్, కర్నూలు.

IN THE COURT OF THE HON'BLE SENIOR CIVIL JUDGE COURT, ADONI.
I.P NO 12/2025

Between:-
Makkam Akhilesh Gupta
Aged 34 years,
S/o M.Lakshminarayana GuptaHno
12/457,Kanchigari Street,
Adoni-518301. ...Petitioner
V/s
Begumpur Pavan Kumar & 32 others.
...Respondents

GENERAL PUBLIC NOTICE

Where as the above named petitioner filed Insolvency petition in the above Court, U/S 10 of Provincial Insolvency Act. Therfore the above respondents and any other general public having objection on the above petition, Appear before this Court at 10:30 AM,On 23/12/2025 in person or through Advocate and file your objections if any.Else this Hon'ble Court will proceed the case and petition will be decided on merits. Hence, this General Public Notice.

// By Order of the Court//
L.S Abdul Ahad,
Saiveer Cheruku,
Advocates for Petitioner
Adoni.

మహారాజ రాజశ్రీ గౌరవనీయులైన సెకండ్
ఆడిషనల్ డిస్ట్రిక్ట్ జడ్జ్ కర్నూలు అట్ ఆదోని
E.P.No.16/2023 IN ARB No. ARC/FSBFL/447

Between:-
M/s. Five Star Business ఫైనాన్స్ లిమిటెడ్,ఆదోని.
రెప్రిజెంటెడ్ బై ఆథారైసేడ్ సిగ్నటరి వై.శ్యామ్ ప్రసాద్.
...డిక్రీ హోల్డర్

మరియు

సన్నకొల్ల మల్లెశప్ప & another....జడ్జ్ మెంట్ డెబీటర్స్
సెల్ నోటిస్ TO జడ్జ్ మెంట్ డెబీటర్ No.1

జడ్జ్ మెంట్ డెబీటర్ No. 1
సన్నకొల్ల మల్లెశప్ప, S/o. బంగారప్ప,
H.No.2/6, S.C. కాలనీ,
సలకలకొండ గ్రామము,
ఆదోని మండలము, కర్నూలు డిస్ట్రిక్ట్.

పై తెలిపిన డిక్రీ హోల్డర్ అయిన M/s. Five Star Business ఫైనాన్స్ లిమిటెడ్, ఆదోని అవార్డ్ ఉత్తర్వుల మేరకు కోర్ట్ నందు కంపెనీకు రావలసిన డబ్బు రాబట్టు కొనుటకు జడ్జ్ మెంట్ డెలీటర్ No.1, మీద పై E.P. ధాఖలు చేసియున్నారు. కోర్ట్ ఉత్తర్వులు మేరకు సెల్ నోటీస్ పేపర్ ప్రకటన మూలకముగా జడ్జ్ మెంట్ డిబీటర్ No.1 కు తెలియ పరచుచున్నాము. వాయిదా తేది: 12.12.2025 సమయము 10:30 am గంటలను నీకు ఏమైన ఆక్షేపణలు లేదా అభ్యంతరాలు ఉన్నయెడల నీవుగాని మీ యొక్క ప్లీడర్ ద్వారా గానీ తెలియపరచుకోవలెను. లేని యడల కోర్ట్ వారు మీ పరోక్షముగా వాది అనుకూలముగా తీర్మానించబడును.

(ఇట్లు కోర్ట్ ఉత్తర్వుల మేరకు)
C. **సోమ శేఖర్,**
డిక్రీ హోల్డర్ తరపున న్యాయవాది, ఆదోని.